సాక్షి
చిత్తూరు

శుక్రవారం । 3 । మే । 2024



ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్యానికి అభయం

ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. జిల్లా డిస్పెన్సరీ ద్వారా సేవలు అందిస్తోంది. - 8లో



వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

జిల్లాలోని పలు నియోజవకర్గాల్లో టీడీపీ, జనసేన నేతలు భారీగా వైఎస్సార్‌సీపీలో చేరారు. - 8లో



నిబద్ధతతో ఎన్నికల విధులు

మైక్రో అబ్జర్వర్లు నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని, పోలింగ్ రోజు వారి పాత్ర కీలకమని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

అవ్వాతాతలపై ఎందుకు బాబూ పగ



మంత్రి రోజా

నగరి : చంద్రబాబు కుట్రల కారణంగానే పింఛన్ కోసం అవ్వాతాతలు నరకయాతన పడుతున్నారని మంత్రి, నగరి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కే రోజా మండిపడ్డారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. అవ్వాతాతలు, దివ్యాంగులపై చంద్రబాబు ఇంత పగ ఎందుకని ప్రశ్నించారు. 58 నెలలు లేని కష్టాలను వారు ఇప్పుడు పడాల్సి వస్తోందన్నారు. ఉదయం ఐదు గంటలకే పెన్షన్ ఇంటికే వెళ్లి ఇప్పించే జగనన్నను చూసి చంద్రబాబు ఓర్వలేకపోయారని ఆరోపించారు. అందుకే కక్షగట్టి నిమ్మగడ్డ రమేష్, అచ్చెన్నాయుడుతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 45 డిగ్రీల ఎండలో వృద్ధులు బ్యాంకుల వద్ద పడే అవస్థలు చూస్తుంటే హృదయం ద్రవించిపోతోందని తెలిపారు. పిల్లను ఇచ్చిన మామకే వెన్నుపోటు పొడిచిన రోజే ఆయనకు కనికరం లేదని నిరూపితమైందన్నారు. అందుకే రాష్ట్రంలో ఎవరూ ఆయనను ఇష్టపడటం లేదని స్పష్టం చేశారు.

రేపు పలమనేరుకు ముఖ్యమంత్రి రాక



పోలీసులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు : ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలమనేరుకు రానున్నారు. గురువారం ఈ మేరకు ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ, అడిషనల్ ఎస్పీ ఆరీఫుల్లా, డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి తదితరులు గంగవరం సమీపంలోని సాయిబాబా ఆలయం వద్ద హెలీప్యాడ్, పట్టణంలోని టవర్‌క్లాక్ సర్కిల్ వద్ద సభాస్థలిని పరిశీలించారు. కార్యక్రమంలో సీబిలు చంద్రశేఖర్, చిన్నగోవిందు, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, నాయకులు సీవీకుమార్, మండీసుధా, మురళీకృష్ణ పాల్గొన్నారు.

'కమాండ్ కంట్రోల్' పనితీరు భేష్



కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న జనరల్ అబ్జర్వర్లు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ పనితీరు అభినందనీయమని జనరల్ అబ్జర్వర్లు కైలాష్ వాంఖడే, షాదిక్ అలం ప్రశంసించారు. గురువారం కలెక్టరేట్‌లోని నూతన స్పందన భవనంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అబ్జర్వర్లు మాట్లాడుతూ కంట్రోల్ రూమ్‌లోని వివిధ విభాగాల సిబ్బంది ఎన్నికల నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్‌ఓ పుల్లయ్య, ఏఓ వెంకటేశ్వరన్ పాల్గొన్నారు.



నగరిలోని ఓ బ్యాంకు వద్ద పెన్షనర్ల పడిగాపులు

ప్రతిపక్షాల కక్ష.. పండుటాకులకు శిక్ష

ప్రతి నెలా ఇంటి వద్దనే తీసుకునే పింఛన్‌కు ఇప్పుడు పడిగాపులు కాయాల్సి వస్తోందని అవ్వాతాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చల్లగా నీడ పట్టున సేదతీరే తమ బతుకులను చంద్రబాబు ఎండలపాలు చేశారని మండిపడుతున్నారు. వలంటీర్ల ద్వారా చేతికే అందే నగదు కోసం ఇప్పుడు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సివస్తోందని వాపోతున్నారు. మందులు.. మాత్రలు సకాలంలో కొనుగోలు చేసుకునే వెసులుబాటు పోయిందని ఆందోళన చెందుతున్నారు. టీడీపీ.. జనసేన కారణంగా నడిచే ఓపికే లేని వయసులో కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని ఆరోపిస్తున్నారు. కక్షగట్టి ఇన్ని కష్టాలు పెట్టేందుకు తామేం నేరం చేశామని ప్రశ్నిస్తున్నారు. సాఫీగా సాగుతున్న జీవితాలను ఇక్కట్ల పాలు చేసిన చంద్రబాబుకు తమ ఉసురు తప్పక తగులుతుందని స్పష్టం చేశారు. - సాక్షి, నెట్‌వర్క్

పింఛన్ నగదుకు పాట్లు
- బ్యాంకుల్లో అవ్వాతాతల బారులు
- మండుటెండల్లో మునలోళ్ల తిప్పలు
- చంద్రబాబు అండ్ కో తీరుపై విరుచుకుపడుతున్న వృద్ధులు

ఏం సాధించావు చంద్రబాబు



మాకు ఫించన్‌లు రానివ్వకుండా మేము కష్టాలు పడేలా చేసి నువ్వు ఏం సాధించావు చంద్రబాబు. వలంటీర్లు ఉన్నప్పుడే కరెక్టుగా డబ్బులు ఇచ్చి వెళ్లేవారు. మాకు ప్రశాంతంగా ఉండేది. మా కష్టాలను వలంటీర్‌లకు చెప్పుకుంటే పరిష్కరించేవారు. పింఛన్‌లను ఇంటి వద్దకు ఇవ్వనివ్వకుండా చేసింది చంద్రబాబునాయుడే. ఇది కరెక్టు కాదు . చంద్రబాబు మోసాలను మేము నమ్మం. బ్యాంకుల్లో ఏ మాత్రం మమ్మల్ని పట్టించుకోవడంలేదు. సందేహాలు అడిగితే విసుక్కుంటున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటికి అవసరమయ్యే బియ్యం, నిత్యావసర వస్తువులు తీసుకునేదాన్ని. ఇప్పుడేమో ఇబ్బందులు పడుతున్నా. ఇందుకు చంద్రబాబే ప్రధాన కారణం. - శాంతి, గిరింపేట, చిత్తూరు

బాబూ నీకెందుకు కడుపు మంట



వలంటీర్ల దగ్గర హాయిగా పింఛన్ డబ్బులు తీసుకునే వాళ్లం. వలంటీరే వచ్చి యాడుండవ్..అవ్వా అంటూ వెతుక్కుంటూ వచ్చి పింఛన్ చేతిలో పెట్టేవాడు. ఆస్పత్రికి వెళ్లినా అడికే వచ్చి పింఛన్ ఇచ్చేవాడు. ఇన్నాళ్లు ఈ డబ్బు తీసుకోవాలంటే ఏ బాధ లేదు. ఎలక్షన్ రాగానే చంద్రబాబుకు కడుపు ఉబ్బిపోయింది. వలంటీర్లు పింఛన్ ఇవ్వకూడదని అడ్డు తగిలినాడు. వలంటీర్లు ఎక్కడ తిరగకుండా చేశాడు. ఇప్పుడు పింఛన్లు తీసుకోవాలంటే అవస్థలు పడుతున్నాం. నాకు బ్యాంకులో వేస్తామని చెబుతుండారు. వేస్తారా..వేయరా తెలియడం లేదు. వెళ్లిన మేమంతా క్యూలో నిలబడి తీసుకోవాలంటే. ఇంకా పడిందో..లేదో తెలియడం లేదు. బ్యాంకు కాడికే వెళితే జనాలు. మేమంటే నీకెందుకు కడుపు మంట బాబు. మా శాపాలు ఊరికే వదలవు. - మునెమ్మ, పెరుమాళ్లకండ్రిగ, చిత్తూరు మండలం

నా వల్ల కాలేదు



ఎండ తీవ్రత ఎక్కువ ఉండడంతో నేను నీరసించిపోతున్నాం. పింఛన్ కోసం బ్యాంక్‌కు వచ్చా. క్యూలో వేచిఉండి కళ్లు తిరుగుతున్నాయి. వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నప్పుడు సంతోషంగా ఉన్నా. ఈ రెండు నెలలుగా పింఛన్ తీసుకోవడం నాకు నరకంలాగా ఉంది. ఈ పింఛన్ డబ్బుతోనే నేను ఇంటి బాడుగ కట్టుకోవాలి. చంద్రబాబు ఉన్నప్పుడు ఇదే పరిస్థితే మాకు , పంచాయతీ కార్యాలయాల దగ్గరకు పొద్దున నుంచి సాయంత్రం వరకు పడి ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి వచ్చింది, తప్పకుండా మళ్లీ వలంటీర్లు రావాలి, వారి ద్వారానే మాకు పింఛన్ అందజేయాలి - రాజమ్మ, పూతలపట్టు

ఎక్కడికి వెళ్లాలో తెలియడం లేదు



సచివాలయానికి వెళితే బ్యాంకు ఖాతాలో డబ్బులు వేశాం అని చెప్పారు. బ్యాంకుకు వెళితే నగదు జమ కాలేదు అని చెబుతున్నారు. ఇంతకీ నాకు రావాల్సిన డబ్బులు ఎక్కడ ఉన్నాయో తెలియదు. చంద్రబాబునాయుడు మాకు పింఛన్‌లు ఇవ్వకుండా ఇలా చేస్తున్నాడు. మాలాంటి వాళ్ల ఉసురు ఆయనకు తప్పకుండా తగులుతుంది. ఇంతకీ నాకు రావాల్సిన పింఛన్ ఎక్కడకు వెళ్లి తీసుకోవాలో అర్థం కావడం లేదు. చంద్రబాబు లాంటి వాళ్ల కారణంగా మాలాంటి ముసలోళ్లు ఇబ్బంది పడుతున్నారు. - చెంగమ్మ, గుడిపాల

మా ఉసురు తగులుతుంది



ఐదేళ్లుగా ఇంటికి వచ్చి వలంటీర్లు పెన్షన్ ఇచ్చేవారు. ఇప్పుడు రెండు నెలలుగా టీడీపీ వాళ్ల వల్ల సకాలంలో పెన్షన్ అందడం లేదు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ డబ్బుల కోసం పంచాయతీ కార్యలయాల వద్ద కాపు కాసి ఉండి తీసుకునే వాళ్లం. సమయానికి తిండి లేక ఇబ్బందులు పడ్డాం. జగన్ రాకతో మా బతుకులు గాడిలో పడ్డాయని సంతోషంగా ఉంటే మళ్లీ చంద్రబాబు వచ్చి ఇబ్బంది పెడుతున్నారు. మా ఉసురు ఆయనకు తప్పకుండా తగులుతుంది. - దేశమ్మ, రొంపిచెర్ల

● పాపం.. వెంకటమ్మ !



ఈమె పేరు వెంకటమ్మ. భర్త మునెప్ప దివ్యాంగుడు. ఇద్దరు కుమార్తెలు, ఒక కొడుకు. శాంతిపురం మండలం కొలమడుగు పంచాయతీ రామాపురంలో నివసిస్తున్నారు. ఉన్నంతలో కుమార్తెలకు పెళ్లి చేసింది. కొన్నేళ్ల క్రితం ప్రమాదవశాత్తు కొడుకు మరణించాడు. దీంతో కాళ్లు లేని భర్త, వంగిన నడుముతో భార్య ఇద్దరే మిగిలారు. భర్తకు దివ్యాంగ పింఛన్, భార్యకు వృద్ధాప్య పింఛన్ ప్రతి నెలా వలంటీర్ల ద్వారా ఇంటికే వస్తుండటంతో చింత లేకుండా జీవనం సాగేది. కానీ రెండు నెలలుగా ఇంటికి పింఛన్ రాక వీరి పరిస్థితి ఇరకాటంలో పడింది. గత నెలలో కొలమడుగులోని సచివాలయానికి వెళ్లి పింఛను సొమ్ము తీసుకున్నారు. ఈ నెలకు సంబంధించి మునెప్ప పింఛన్‌ను సచివాలయ సిబ్బంది ఇంటి వద్దనే ఇచ్చారు. వెంకటమ్మ పింఛన్ తన బ్యాంకు ఖాతాలో జమ కావటంతో రూ 400 వందలకు ఆటో మాట్లాడుకుని మండుటెండలో భర్తతో పాటు శాంతిపురానికి వచ్చింది. సప్తగిరి గ్రామీణ బ్యాంకులో తన పింఛను సొమ్మును తీసుకుంది. వంగిపోయి, నడవలేక యాతన పడుతున్న వెంకటమ్మను చూసిన వారు 'అయ్యో పాపం' అని సానుభూతి చూపించారు. తన లాంటి వారికి ఇంటి వద్దే పింఛన్ అందకుండా చంద్రబాబు కుట్రలు చేయడం అన్యాయమని వాపోతోంది.

బాబుకు ఓటు అడిగే అర్హతే లేదు

- కిరణ్‌కు డిపాజిట్ కూడా దక్కదు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పుంగనూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు : ఎన్నికల సమయంలో ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేసే చంద్రబాబుకు కనీసం ఓటు అడిగే అర్హత కూడా లేదని మంత్రి, వైఎస్సార్‌సీపీ పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని కొత్తయిండ్లు, కొత్తపేట, ఎల్‌ఐసీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. మంత్రి మాట్లాడుతూ బీజేపీ రాజంపేట ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి చచ్చిన పాములాంటివాడని , ఆయనకు డిపాజిట్ కూడా దక్కదని స్పష్టం చేశారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు 600 హామీలతో మేనిఫెస్టోను విడుదల చేసి, అధికారంలోకి రాగానే మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేసేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ తూచా తప్పకుండా నెరవేర్చారని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్య, ఆరోగ్యం, పేదల ఇళ్ల నిర్మాణానికి పెద్దపీట వేసినట్లు వెల్లడించారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలనను తీసుకెళ్లి సేవలు అందించామని తెలిపారు. వలంటీర్లు అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. కరోనా కష్టకాలంలో కుటుంబ సభ్యులు సైతం భయపడినా, జగనన్న వలంటీర్లు మాత్రం ధైర్యంగా రోగులకు సేవలు అందించారని స్పష్టం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదరికమే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించామని వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి చేసేవి మాత్రమే చెబుతారని , వాటినే మేనిఫెస్టోగా విడుదల చేశారన్నారు. ఐదేళ్లలో 98 శాతం ఎన్నికల హామీలను అమలు చేసిన వైఎస్సార్‌సీపీకే ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్లి ఓటు అడిగే అర్హత ఉందని వెల్లడించారు. చంద్రబాబు , పవన్‌కల్యాణ విడుదల చేసిన ఉమ్మడి మేనిఫెస్టోకి బీజేపీ దూరంగా ఉందని, దీన్ని బట్టే అది ఎంత మోసకారి మేనిఫెస్టోనో అర్థమవుతోందని తెలిపారు. బాబు మేనిఫెస్టోను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓటమి తప్పదని స్పష్టం చేశారు. ఈనెల 13న జరిగే పోలింగ్ రోజున ప్రతి ఒక్కరూ తమ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జి ఫకృద్దీన్‌షరీఫ్, వక్ఫ్ బోర్డు చైర్మన్ జిల్లా అమ్ము పాల్గొన్నారు.

టీడీపీకి ఇవే చివరి ఎన్నికలు



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం : చంద్రబాబు బూటకపు హామీలను ప్రజలు నమ్మరని, టీడీపీకి ఇవే చివరి ఎన్నికలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి స్పష్టం చేశారు. గురువారం మండలంలోని వనదుర్గాపురం, తొట్టికండ్రిగ, కృష్ణజమ్మపురం, శ్రీకావేరిరాజుపురం, పాలసముద్రం పంచాయతీల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 99.5 శాతం అమలు చేశారన్నారు. సచివాలయాల ద్వారా 1.35 లక్షల మందికి ఉద్యోగావకాశం కల్పించారని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖలో 54 వేల పోస్టుల భర్తీ, పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇచ్చేలా చట్టం తీసుకువచ్చారని వెల్లడించారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్‌తో కలసి ఐదేళ్లలోమొత్తం 6.48 లక్షల ఉద్యోగాలు ఇచ్చినట్లు వివరించారు. ప్రజలకు మేలు చేశామనే పెద్దసంఖ్యలో ఇతర పార్టీల నుంచి వైఎస్సార్‌సీపీలోకి వస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో గెలవలేమని భావించే చంద్రబాబు జనసేన, బీజేపీతోపాటు రహస్యంగా కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకున్నారని ఆరోపించారు. ఒకప్పుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీని హీనంగా తిట్టిన చంద్రబాబు కేసుల భయంతో బీజేపీకి సాష్టాంగం పడ్డారని విమర్శించారు. అధికారం కోసం కుట్రలకు పాల్పడుతున్న చంద్రబాబుకు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించామని, ఈ ఎన్నికల్లో తన కుమార్తె కృపాలక్ష్మిని ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. చంద్రబాబు కళ్లలో ఆనందం చూడడానికే పీసీసీ అధ్యక్షులు షర్మిల విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. రాజన్న రాజ్యం తెస్తానని తెలంగాణలో పార్టీ పెట్టిన షర్మిల అక్కడి ప్రజలు తిరస్కరించడంతో ఏపీకి వలస వచ్చారని విమర్శించారు. ప్రతిపక్షాలన్నీ ఏకమైనామళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.శివప్రకాష్ రాజు, సింగిల్‌విండో చైర్మన్ గాలి జ్యోతి, వైస్ ఎంపీపీ శేఖర్ యాద్, పార్టీ మండల కన్వీనర్ తులసియాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, సినీ నిర్మాత షణ్ముగం, ఆర్‌బీకే చైర్మన్ పోలయ్య, పుత్తూరు మార్కెట్ డైరెక్టర్ రమాదేవి, కో-ఆప్షన్ మెంబర్ వేలు, సర్పంచ్ గాలి మహేష్ బాబు, అయ్యప్ప, నరసింహరాజు, భాష్కర్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, పుత్తూరు కేశవరెడ్డి, మురళి, నరసింహన్, ప్రేమ్‌కుమార్, ఆనందన్, ప్రకాష్, కుమార్, చంద్రశేఖర్‌రాజు, షణ్ముగరెడ్డి, వరదరాజు, చిన్నవరదరాజు, సిద్ధమందడి, శరవణన్, కుట్టి, చిన్నపయ్యన్, లక్ష్మణన్, రాజామణి, అరుల్, బాబు, మనోహర్, దనంజయన్, వాసురాజు, కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు షణ్ముగం పాల్గొన్నారు.

ఎన్నికల పర్యవేక్షకుడితో ఎస్పీ భేటీ



బినోద్‌కుమార్‌కు పూలమొక్క అందిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: జిల్లాకు కొత్తగా నియమితులైన ఎన్నికల పోలీసు పర్యవేక్షకుడు బినోద్‌కుమార్‌తో ఎస్పీ మణికంఠ భేటీ అయ్యారు. గురువారం చిత్తూరు పోలీసు అతిథిగృహానికి వచ్చిన బినోద్‌కుమార్‌ను మర్యాదపూర్వంగా కలిసి పూలమొక్క అందించారు. ఎన్నికల ప్రక్రియపై చర్చించారు.

'ఆయుష్మాన్ భారత్'తో వైద్య సేవలు సులభం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (అభ) ద్వారా దేశవ్యాప్తంగా వైద్యసేవలను సులభంగా పొందవచ్చని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి తెలిపారు. గురువారం చిత్తూరులోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అభ డిజిటలైజేషన్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయుష్మాన్‌భారత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ తమ వివరాలను డిజిటలైజేషన్ చేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు హర్షవర్ధన్, సుదర్శన్, జార్జ్, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 16,571 పోస్టల్ బ్యాలెట్లు



షణ్మోహన్, జిల్లా ఎన్నికల అధికారి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో వివిధ కేటగిరీలకు సంబంధించి మొత్తం 16,571 మంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారని, వారందరికీ బ్యాలెట్ అందిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులందరూ ఈ నెల 5,6 తేదీల్లో ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలన్నారు. ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ముందస్తుగా ఇవ్వడం కుదరదని స్పష్టం చేశారు. నిర్దేశిత తేదీల్లో ఆయా సెంటర్లలో దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులను నేరుగా పరిశీలించి పోస్టల్‌బ్యాలెట్ ఇచ్చి అప్పటికప్పుడే ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు ఆయా నియోజకవర్గాల్లో, ఇతర జిల్లాల ఉద్యోగులు కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ భవనం వద్ద ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవచ్చన్నారు. ఈ నెల 5 న పీఓ, ఏపీఓ, ఓపీఓ, మైక్రో అబ్జర్వర్‌లు, 6వ తేదీన అత్యవసరశాఖల ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేయాల్సి ఉంటుందని చెప్పారు. ఏప్రిల్ 26వ తేదీలోపు పోస్టల్‌బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోలేని ఉద్యోగులు ఈ నెల 5,6 తేదీల్లో నేరుగా సంబంధిత ధ్రువీకరణపత్రాలు చూపించి ఓటు హక్కు సద్వినియోగం చేసుకునే అవకాశం కల్పించామని వివరించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే సమయంలో తమ వెంట ఆధార్ కార్డు, ఓటరు ఐడీ, ఎన్నికల విధులకు సంబంధించి ఉత్తర్వులు తీసుకెళ్లాలని సూచించారు. హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న 566 మందికి ఈ నెల 6,7 తేదీల్లో ఇంటి వద్దకే ఓటు వేయించే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. 3,380 మంది సర్వీసు ఓటర్లు తమకు అందిన పోస్టల్ బ్యాలెట్‌ను డౌన్‌లోడ్ చేసుకొని తమ పోస్టల్ బ్యాలెట్ ను సంబంధిత ఆర్‌ఓ కార్యాలయాలకు ఈ నెల 10వ తేదీలోపు చేరేలా పోస్టులో పంపాలని కోరారు. జిల్లావ్యాప్తంగా ఓటర్ స్లిప్‌ల పంపిణీని ఈ నెల 6వ తేదీలోపు పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా రూ.2.63 కోట్ల నగదు సీజ్ చేశామని తెలిపారు. సరైన ఆధారాలు చూపిన వారికి నగదు తిరిగి చెల్లిస్తున్నామని చెప్పారు. సమావేశంలో చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్‌ఓ పుల్లయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిజాయితీకి మారుపేరు నారాయణస్వామి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

వెదురుకుప్పం : 'అతనెవరో థామస్ అట..టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి...నేనింతవరకూ చూసింది కూడా లేదు..రావడం.. తిట్టడం ఇదే పనిగా పెట్టుకున్నారు... నిజాయితీకి మారు పేరు మా తండ్రి డిప్యూటీ సీఎం నారాయణస్వామిని, నన్ను నిత్యం ఆడి పోసుకోవడమే పనిగా పెట్టుకున్నాడు...నేనొక్కటే చెబుతున్నా పిచ్చి పిచ్చిగా మాట్లాడితే ప్రజలే తరిమికొడతారు' అని వైఎస్సార్‌సీపీ గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి మండిపడ్డారు. శుక్రవారం మండలంలోని ఎనమలమంద గ్రామంలో ఎన్నికల ప్రచారం అనంతరం మీడియాతో మాట్లాడారు. నీతిగా రాజకీయాలు చేసిన తన తండ్రిని అవినీతి పరుడు అంటూ సంస్కారం లేని వ్యక్తులందరూ విమర్శలు చేయడం బాధేస్తుందన్నారు. కష్టానికి నిదర్శనం మానాన్న... విలువ తెలిసిన వ్యక్తిగా మానాన్న పేద ప్రజల గుండెల్లో ఉన్నారు.. నేను ఎక్కడికెళ్లినా మన అన్న నారాయణస్వామి కుమార్తె అంటూ అక్కున చేర్చుకుంటున్నారు. అలాంటిది ఓ మహిళ అనే ఇంగితం కూడా లేకుండా థామస్ అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఏం చేయదలచుకున్నారో అది చెప్పుకోవాలి కానీ, మమ్మల్ని చులకన చేసి మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. క్రిమినల్ కేసులున్న వ్యక్తి కూడా తమపై నిందలు వేయడం దారుణమన్నారు. టీడీపీ అభ్యర్థి థామస్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.

■ పరంధామయ్య అనే డ్రైవర్‌కు గత ఏడాది సెప్టెంబర్ 1వ తేదీన గుండె జబ్బుతో బాధపడుతూ చిత్తూరులోని ఆర్టీసీ డిస్పెన్సరీలో చేరాడు. గుండె నొప్పి తీవ్రంగా ఉండడంతో అక్కడి డాక్టర్ చికిత్స చేసి ఈసీజీ తీశారు. హార్ట్ ఎటాక్ అనుమానిత కేసుగా గుర్తించారు. ఆయన వెంటనే ఈహెచ్ఎస్ సౌకర్యం ఉన్న ఆస్పత్రికి వెళ్లేలా చర్యలు చేపట్టా. అక్కడ ఆపరేషన్‌చేసి స్టెంట్ పెట్టారు. ప్రస్తుతం పరంధామయ్య ఆరోగ్యంగా ఉన్నాడు. త్వరలోనే విధులకు సైతం హాజరుకానున్నాడు.

■ ఈ ఏడాది జనవరి 9వ తేదీన దాము అనే ఉద్యోగికి డ్యూటీ సమయంలోనే గుండె నొప్పి వచ్చింది. తోటి ఉద్యోగి అతడిని తక్షణమే డిస్పెన్సరీకి తీసుకువచ్చాడు. డాక్టర్ ఈసీజీ తీయించి గుండె సంబంధిత వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారు. ఈహెచ్ఎస్ సదుపాయం ఉన్న ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ సకాలంలో శస్త్రచికిత్స చేసి స్టెంట్ వేశారు. ప్రస్తుతం డిశ్చార్జ్ అయ్యాడు. ఆరోగ్యంగా ఉన్నాడు. చికిత్స నిమిత్తం ఆయనకు పైసా కూడా ఖర్చు కాలేదు.

ఆర్టీసీ డిస్పెన్సరీలో చికిత్స కోసం వచ్చిన ఉద్యోగులు (ఫైల్)



ఆర్టీసీ ఉద్యోగులకు ఆరోగ్య అభయం

ప్రస్తుత సర్కారు ఇచ్చిన మాటకు కట్టుబడి పాలన సాగిస్తోంది. అందులో భాగంగా తొలుత ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసింది. అందులో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించింది. అలాగే ఆరోగ్యరక్షణకు సైతం అభయం హస్తం అందించింది. ఈ క్రమంలో ఆర్టీసీ డిస్పెన్సరీని అత్యాధునికంగా అభివృద్ధి చేసింది. విలువైన మందులను సైతం అందుబాటులో ఉంచుతోంది. శస్త్రచికిత్సల నిమిత్తం ఈహెచ్ఎస్ సౌకర్యం కల్పించింది. ఈ మేరకు వైద్యసేవల అమలుపై ఆడిట్ వ్యవస్థను ప్రవేశపెట్టింది. చిత్తశుద్ధితో ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వంపై ఎల్లోమీడియా బురదజల్లేందుకు యత్నిస్తోంది. అసత్య కథనాలను ప్రచురిస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించేందుకు తెగబడుతోంది.

కాణిపాకం : జిల్లాలోని ఆర్టీసీ డిస్పెన్సరీ కింద 8 డిపోలు వస్తాయి. సుమారు 6వేల మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో పాటు 13 వేల మంది ఇక్కడ చికిత్స పొందే అవకాశముంటుంది. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అలాగే మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ డిస్పెన్సరీ సేవలు అందిస్తోంది. ఇందులో ఒక డాక్టర్, ఫార్మసిస్ట్, ల్యాబ్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్, అటెండర్ ఉంటారు. ప్రతిరోజు ఇక్కడ 100 పైగా ఓపీ కేసులు చూస్తున్నారు. గుండె సంబంధిత వ్యాధులు, బీపీ, మధుమేహం, కాళ్లనొప్పులు తదితర సమస్యల కోసం అధిక సంఖ్యలో రోగులు వస్తుంటారు. ఈ డిస్పెన్సరీలో 23 రకాల పరీక్షలు అందుబాటులో ఉంటాయి. నెలవారీ దాదాపు 1,500మందికి పరీక్షలు నిర్వహిస్తుంటారు. తద్వారా మెరుగైన వైద్యం అందేలా చూస్తున్నారు. 270 రకాల మందులు, మాత్రలు అందుబాటులో ఉంచుతున్నారు. ఈ మాత్రలు, మందులు విజయవాడ నుంచి డిస్పెన్సరీకి సరఫరా అవుతుంటాయి. ప్రస్తుతం ప్రభుత్వ హయాంలోనే ఆర్టీసీ డిస్పెన్సరీకి ఈసీజీ, ఆక్సిజన్ మిషన్లు, రక్త పరీక్ష పరికరాలు సమకూరాయి. ఫలితంగా ల్యాబ్ పరీక్షలకు బయటకు వెళ్లాల్సిన దుస్థితి తప్పింది. దీంతో డిస్పెన్సరీకి వచ్చే ఉద్యోగుల సంఖ్య పెరిగింది. అనారోగ్య సమస్య తీవ్రంగా ఉంటే వెంటనే ఈహెచ్ఎస్ ద్వారా వైద్య సేవలు అందేలా చూస్తున్నారు. ఈహెచ్ఎస్ పరిమితి ప్రకారం సంబంధిత ఆస్పత్రుల్లో అన్నిరకాల వ్యాధులకు చికిత్స అందుతోంది.

గత ప్రభుత్వంలో ఇలా..

గత ప్రభుత్వంలో ఆర్టీసీ అవస్థలమయంగా ఉండేది. ఆర్టీసీ ఉద్యోగులు తమ డిమాండ్లను నెరవేర్చాలని రోడెక్కితే పోలీసులతో దాడులు చేయించేవారు. వేతన అవస్థలతో పాటు కనీస అలవెన్సులు సైతం ఉండేవి కావు. ఆర్టీసీని తాకట్టుపెట్టే స్థాయిలో వ్యవహరించింది. ఉద్యోగుల కష్టాలను పట్టించుకోలేదు. ఆర్టీసీని మరింతగా అప్పులపాలు చేసింది. ప్రధానంగా ఆర్టీసీ డిస్పెన్సరీలో వైద్య సేవలు కరువయ్యాయి.170 నుంచి190 రకాల మాత్రలు అందుబాటులో ఉండేది. అవి కూడా నాణ్యతాప్రమాణాల మేరకు ఉండేవి కావు. కొన్ని రకాల పరీక్షలు చేస్తూ..మిగిలిన ల్యాబ్ పరీక్షలకు బయటకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో ఓపీకి వచ్చేవారి సంఖ్య తక్కువగా ఉండేది. రోజూ ఓపీ సంఖ్య 40 నుంచి 60 మంది దాటేది కాదు. అక్కడి లోపాలపై అప్పట్లో ఉద్యోగులు పలు మార్లు ఫిర్యాదు చేశారు. విజిలెన్స్ అధికారులు చేపట్టిన తనిఖీలో లక్షలాది రూపాయలు విలువ చేసే బోగస్ మాత్రలు దొరకడం అప్పట్లో కలకలం రేపింది.

అవాస్తవాలతో కథనాలు

ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం కావడం సహించలేని టీడీపీ, ఎల్లో మీడియా బురదజల్లే ప్రయత్నం చేస్తోంది. వాస్తవాలను వక్రీకరిస్తూ తప్పుడు కథనాలు ప్రచురిస్తోంది. ఆర్టీసీ ఉద్యోగులను తప్పుదారి పట్టించాలని చూస్తోంది. ఈ విషయం గమనించిన ఉద్యోగులు ఇదంతా ఎందుకు చేస్తున్నారో అర్థమైందంటూ బహిరంగంగానే వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం.

మంత్రి రోజా వెంటే 'సెంగుంధర్లు'



మంత్రి రోజాకు మద్దతు ప్రకటిస్తున్న కన్నాయిరం

నగరి : సెంగుంధర్ల అభివృద్ధి, సంక్షేమం కోసం తమిళనాడులో స్థాపించిన అన్నామక్కల్ పార్టీ మంత్రి ఆర్‌కే రోజాకు మద్దతు పలికింది. గురువారం ఈ మేరకు ఆ పార్టీ ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు కన్నాయిరం మంత్రి రోజాను కలిసి తమ సమ్మతి పత్రం అందించి, ఆమెను సత్కరించారు. కన్నాయిరం మాట్లాడుతూ కరోనా సమయంలో మంత్రి రోజా సెంగుంధర్లకు అన్ని విధాలుగా సహకరించడం మరువలేమన్నారు. ఆర్డర్లు లేక అవస్థలు పడిన సమయంలో ప్రభుత్వ యూనిఫామ్ ఆర్డర్లు ఇప్పించి రక్షించిన ఘనత రోజమ్మకే దక్కుతుందని కొనియాడారు. తమ కుల వృత్తి అయిన నేత పరిశ్రమకు అందించిన సహకారం ఎనలేదని ప్రశంసించారు. సెంగుంధర్లకు మద్దతుగా నిలబడిన మీకు ఎప్పటికీ అండగా ఉంటామని వెల్లడించారు. మంత్రి రోజా మాట్లాడుతూ తన భర్త కూడా సెంగుంధర్ కులస్తులేనని, నేను ఆ ఇంటి కోడలినే అన్నారు. వారి కోసం తన వంతు సహకారం ఎప్పుడూ అందిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు బీఆర్వీ అయ్యప్పన్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, నాయకులు మోహన్, పీతాంబరం, గుణశేఖర్, సుబ్రమణ్యం, అన్నామలై పాల్గొన్నారు.

నిబద్ధతతో ఎన్నికల విధులు



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : పోలింగ్ రోజున మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ ఆదేశించారు. గురువారం చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిష్పక్షపాతంగా సజావుగా ఎన్నికల నిర్వహణ పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లాలోని 425 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం మైక్రోఅబ్జర్వర్లకు విధులు కేటాయిస్తామని వెల్లడించారు. పోలింగ్ రోజున అందజేయాల్సిన 18 రకాల రిపోర్టులపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. గంగాధరనెల్లూరు, నగరి అసెంబ్లీ నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్ కైలాష్ వాంఖడే మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్‌లు ఎన్నికల సంఘం ఇచ్చిన హ్యాండ్ బుక్ ను పూర్తిగా చదవాలన్నారు. ఎన్నికల విధుల్లో ఏమైనా సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం అసెంబ్లీ నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్ షాదిక్‌అలం మాట్లాడుతూ పోలింగ్ సమయంలో ఏ ఇబ్బందులు తలెత్తినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎన్నికల సంఘానికి మైక్రో అబ్జర్వర్‌లు కళ్లు, చెవులు లాంటి వారని వివరించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మైక్రో అబ్జర్వర్లకు విధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి రబ్బానీబాషా, లీడ్ బ్యాంక్ మేనేజర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార వాహనంపై టీడీపీ గూండాల దాడి



ఆటోవద్ద నాగభూషణం

నగరి : మండలంలోని కావేటిపురంలో మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కే రోజా ప్రచారవాహనంపై టీడీపీ గూండాలు దాడికి పాల్పడ్డారు. గురువారం కావేటిపురం ప్రాంతంలో టీడీపీ అభ్యర్థి భానుప్రకాష్ ప్రచారం ఉండటంతో పచ్చమూకలు వైట్‌హౌస్ వద్ద సుమారు 50 మంది వేచివున్నారు. మంత్రి ప్రచార ఆటో నడిపే ఆర్.నాగభూషణం ఆ ప్రాంతానికి చెందినవాడు కావడంతో వాహనంతో అటువైపుగా వెళ్లాడు. పంచాయతీలో అధికశాతం వైఎస్సార్‌సీపీలో చేరిపోవడంతో జీర్ణించుకోలేకపోతున్న పచ్చమూకలు తమ ప్రతాపాన్ని ప్రచారవాహనంపై చూపాయి. ఆటోను ఆపి డ్రైవర్‌ను కిందకుతోసి ఫ్లెక్సీలోని మంత్రి చిత్రపటాన్ని బ్లేడ్లతో కోసేశారు. దీనిపై ఆర్‌ఓ, పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు.

అకస్మాత్తుగా వచ్చి పడ్డారు

"మంత్రి రోజమ్మ ప్రచార ఆటోను నడుపుతూ రోజూ ఈ మార్గంలోనే వెళతాను. అక్కడ టీడీపీ రౌడీలు ఉన్నది గమనించలేదు. అకస్మాత్తుగా వచ్చి పడ్డారు. ఆటోను అడ్డుకున్నారు. నన్ను కిందకుతోసేశారు. మంత్రి ఫెక్సీని ధ్వంసం చేశారు.. ఏందిరా నీ ప్రచారం అంటూ బూతులు తిట్టారు. చిరంజీవి అనే అతను నన్ను తోసేస్తే సెల్వమణి, పుష్పరాజ్, బాబు, రాజ్‌కుమార్ అనేవాళ్లు మరికొందరితో కలిసి ఫ్లెక్సీలు చింపేశారు" అని బాధితుడు నాగభూషణం తెలిపాడు.

విజయానందరెడ్డి పిలుపు మేరకే..

● చిత్తూరులో పరిశ్రమల స్థాపనకు ఎన్‌ఆర్‌ఐలు



మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌ఐలతో రెడ్డెప్ప, విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరులో పరిశ్రమల స్థాపనకు అవకాశాలు మెండుగా ఉన్నాయని ఎన్‌ఆర్‌ఐలు శ్రీనివాస్‌రెడ్డి, ఉపేంద్రకుమార్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం చిత్తూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి ఆహ్వానం మేరకు ఇక్కడ పరిశ్రమలు పెట్టడానికి ముందుకు వచ్చామన్నారు. చిత్తూరుకు చెన్నై, బెంగళూరు సమీపంలో ఉండడం మంచి విషయమని చెప్పారు. త్వరలోనే అన్ని అనుమతులు తీసుకుని ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎన్‌ఆర్‌ఐలకు ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా చిత్తూరు పారిశ్రామికంగా వెనుకపడిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ప్రాంతంలో కంటైనర్ యార్డ్, లెదర్ పార్క్ పెట్టడానికి వెసులుబాటు ఉందని వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన రాజారెడ్డి దంపతులు



మహాసముద్రం గ్రామంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న దళితులు



వైఎస్సార్‌సీపీలో చేరిన ముస్లిం యువతతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ నేత మల్లికార్జునరాజు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సునీల్‌కుమార్, బాబురెడ్డి



పార్టీలో చేరిన వాళ్ళతో ఎమ్మెల్యే వెంకటేగౌడ, నాయకులు

పుంగనూరు : జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన నుంచి భారీగా నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. అందులో భాగంగా గురువారం పుంగనూరులో టీడీపీ నేత ఆర్‌టీ రాజారెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి పార్టీలో చేరారు. అలాగే అలాగే చింతపండు వ్యాపారి అహమ్మదాటీ, కట్టక్రిందపాళానికి చెందిన టీడీపీ నాయకులు మల్లికార్జునరాజు, వారి కుటుంబ సభ్యులు పార్టీలో చేరారు. మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, మైనార్టీల నాయకుడు నజీర్ ఆధ్వర్యంలో ముస్లింయూత్ సభ్యులు జాకీర్, అబ్బాస్, మహమ్మద్, ముబారక్, ఇర్ఫాన్, షఫీ, ఇమ్రాన్, యూసుఫ్, షారు, ఆయాస్‌తో పాటు 20 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి మంత్రి పెద్దిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనాథరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆవుల అమరేంద్ర, కో–ఆప్షన్ మెంబర్ తుంగా మంజునాథ్, బలిజ సంఘం నేత రాయల జగదీష్‌కుమార్, పార్టీ నాయకులు ప్రభాకర్, రాజారెడ్డి, మునిరాజా, ఆవుల హరి, ఎస్వీటీ సోము పాల్గొన్నారు.

చంద్రబాబుపై ప్రజలకు నమ్మకం లేదు

పాలసముద్రం : చంద్రబాబుపై ప్రజలకు నమ్మకం లేదని, అందుకే టీడీపీ మేనిఫెస్టోను ఎవరూ పట్టించుకోవడం లేదని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు రమేష్, గోపాల్‌రెడ్డి, పయణి, ఆర్ముగరెడ్డి, ఏలు మలై, వయ్యాపురి, మనోహర్, పెరుమాళ్‌తోపాటు 20 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. వారికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.శివప్రకాష్ రాజు, సింగిల్‌విండో చైర్మన్ గాలి జ్యోతి, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, పార్టీ మండల కన్వీనర్ తులసియాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, సినీ నిర్మాత షణ్ముగం, ఆర్‌బీకే చైర్మన్ పోలయ్య, పుత్తూరు మార్కెట్ కమిటీ డైరక్టర్ రమాదేవి,పాల్గొన్నారు.

చిత్తూరులో..

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక కాజూరు ప్రాంతానికి చెందిన టీడీపీ, జనసేన కార్యకర్తలు పలువురు వైఎస్సార్‌సీపీ నేత డేవిడ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప సమక్షంలో వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి కండువా వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో విజ్జి, శ్రీకాంత్, సతీష్, చైతన్య, హరిప్రసాద్, సోము, ప్రశాంత్, ప్రసాద్, రఫీ, సురేష్, హేమాద్రి తదితరులు ఉన్నారు. అలాగే రామ్‌నగర్‌కాలనీకి చెందిన టీడీపీ నాయకులు గ్రానైట్ బాబు, కువైట్ బాబు, పీహెచ్ వాలి, అక్బర్ బాషా వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు చాన్‌బాషా, కుమార్ పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: మండలంలోని చీకూరుపల్లెలో గురువారం పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ సమక్షంలో జనసేనకు చెందిన 10 కుటుంబాలవారు వైఎస్సార్‌సీపీలో చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మహాసముద్రం దళితవాడలో..

బంగారుపాళెం మండలం మహాసముద్రం దళితవాడలో బుధవారం రాత్రి 100 కుటుంబాలవారు తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరు నాలుగు రోజులు క్రితం టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ ప్రలోభాలకు గురిచేయడంతో టీడీపీలో చేరారు. తర్వాత మనస్తాపం చెందిన సొంతగూటికి వచ్చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శరత్‌రెడ్డి వారిని ఆహ్వానించారు.

పూతలపట్టులో..

ఐరాల: పూతలపట్టు మండలం వేపనపల్లెకు చెందిన జనసేన నాయకులు చిరంజీవి, తిరుమలేష్, బాలాజీ, వినోద్ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, జిల్లా యువత విభాగ కార్యదర్శి తరుణ్‌రెడ్డి, మండల యువత విభాగం అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అమరనాథ్‌రెడ్డి, సిద్ధారెడ్డి, సురేంద్ర, సుధా, జ్యోతిరెడ్డి, సాకేత్‌రెడ్డి పాల్గొన్నారు.

గంగవరంలో..

గంగవరం : మండలంలోని కొత్తపల్లె పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన శ్రీహరి, గిరి, మణి, జగదీష్, గంగాధర, మనోజ్, దూర్వాసులు తమ కుటుంబాలతో సహా వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ వారిని పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ మండల కన్వీనర్ మహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు చంద్రప్ప, శ్రీరాములు రెడ్డి, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి పాల్గొన్నారు.



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీ చేరిన వారితో డిప్యూటి సీఎం నారాయణస్వామి



పార్టీలో చేరిన కాజూరు వాసులతో రెడ్డప్ప, విజయానందరెడ్డి



పార్టీలో చేరిన రామ్‌నగర్‌కాలనీ వాసులు



బంగారుపాళెం: చీకూరుపల్లెలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన కార్యకర్తలు

క్లుప్తంగా

ఓటర్ స్లిప్పు లేదని టెన్షన్ పడొద్దు!



ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఎల్ఓలు ఓటర్ స్లిప్పులను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేసే కార్యక్రమాన్ని జిల్లాలో మొదలు పెట్టారు. ఒకవేళ ఓటరు స్లిప్పులు లేకున్నా ఓటేసే అవకాశం ఉంది. ఎన్నికల రోజు బీఎల్ఓలు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారు. వారి వద్దకు వెళ్లి ఓటరు స్లిప్ పొందవచ్చు. లేకపోతే ఓటర్ల జాబితాలో క్రమ సంఖ్య తెలుసుకుని పోలింగ్ ఏజెంట్లకు చెప్పి వారికి తానే సంబంధిత ఓటరని నిరూపించుకునే గుర్తింపు కార్డును చూపి ఓటేయచ్చు. లేదంటే పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసే జాబితాను పరిశీలించి పేరు, క్రమ సంఖ్యను కాగితంపై రాసుకుని వెళ్లవచ్చు. ఆ సమయంలో ఓటరు తగిన గుర్తింపు కార్డును తప్పకుండా వెంట తీసుకెళ్లి పోలింగ్ కేంద్రంలో ఉండే అధికారులకు చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

– చిత్తూరు కలెక్టరేట్

అభ్యర్థుల ఖర్చులకు ఎప్పటికప్పుడు ఆడిట్



మాట్లాడుతున్న చిత్తూరు పార్లమెంట్ ఎన్నికల వ్యయపరిశీలకులు శంకర్ ప్రసాద్‌శర్మ

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు పార్లమెంట్ పరిధిలో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఖర్చుల వివరాలు ఎప్పటికప్పుడు ఆడిట్ చేసుకోవాలని చిత్తూరు పార్లమెంట్ ఎన్నికల వ్యయపరిశీలకులు శంకర్ ప్రసాద్‌శర్మ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన పోటీలో ఉన్న అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, అభ్యర్థులు ఎన్నికల నియమావళి విధిగా పాటించాలన్నారు. పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న అభ్యర్థులు రూ.95 లక్షల వరకు మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం ఆమోదించిన రేట్ల ప్రకారం ఖర్చులను చూపించాలని, ఆ వివరాలను ఇచ్చిన నమూనాలో రోజు వారీ రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ పుల్లయ్య, అభ్యర్థులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

మేధోమథనం

ఆ మేనిఫెస్టోలో అధికార దాహమే!



- బాబు మేనిఫెస్టోను, హామీలను నమ్మి గతంలో ప్రజలు మోసపోయారు
- ప్రజల కష్టాల నుంచి పుట్టిందే వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో
- స్వలాభం కోసం పాడి పరిశ్రమ బాబు నిర్వీర్యం చేశారు
- పాడి రైతును రాజుగా నిలబెట్టింది సీఎం జగనే
- గ్రామీణ పశువైద్యానికి పెద్దపీట వేశారు
- స్వర్ణయుగాన్ని తలపించిన జగన్ ఐదేళ్ల పాలన
- డాక్టర్ పద్మనాభరెడ్డి, విశ్రాంత వీసీ, ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ

తిరుపతి సిటీ: చంద్రబాబు నాయుడు అధికార దాహంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఆయన మేనిఫెస్టోలో అధికార దాహం కనిపిస్తోందని తిరుపతి ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ మాజీ వీసీ డాక్టర్ వీ పద్మనాభరెడ్డి వ్యాఖ్యానించారు. ఎలాగైనా ప్రజలను మరోసారి వంచించి అధికారంలోకి రావాలనే తాపత్రయంతో మేనిఫెస్టోను విడుదల చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో గ్రామీణ ప్రజల కష్టాలను కళ్లారా చూశారు. ప్రజల కష్టాల నుంచి పుట్టిందే ఆయన ప్రజల ముందు ఉంచిన మేనిఫెస్టో. 2019 నుంచి ఇప్పటి వరకు జరిగిన ఐదేళ్ల పాలన స్వర్ణయుగాన్ని తలపించింది. నవరత్నాలను అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి అందజేశారు. పేదల ప్రాథమిక అవసరాలైన కూడు, గూడు, గుడ్డ కల్పించారు. దీంతో పేద ప్రజలకు ఆయన దేవుడయ్యారని ఆయన చెప్పారు. గురువారం 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు.

హెరిటేజ్ కోసం పాడి పరిశ్రమను నిర్వీర్యం చేసిన బాబు

చంద్రబాబు తన స్వలాభం కోసం పాడి రైతులను నట్టేటముంచారు. తన సొంత హెరిటేజ్ సంస్థను లాభాల బాటలో నడిపించేందుకు గ్రామీణ పాడి రైతులను బలిపశువులను చేశారు. లాభాల బాటలో పయనిస్తున్న విజయా డెయిరీని, ప్రభుత్వ పాల కేంద్రాలను మూసివేశారు. దీంతో రైతులు తమ పశు సంపదను అమ్ముకోవాల్సి వచ్చింది. దీనిని ఇప్పటికీ మహిళా రైతులు మరచిపోలేదు. ఎన్నికల వేళ మరో మారు ఆయన ప్రకటించిన ఉమ్మడి మేనిఫెస్టోలోని హామీలను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదు. మేనిఫెస్టోలో హామీల గురించి ప్రకటించినప్పుడు అవి నెరవేర్చగలమా? అనే ఆలోచన చేయాలేగానీ ప్రజలను మభ్య పెట్టేలా ఉండకూడదు. జగన్ మేనిఫెస్టోకి..బాబు మేనిఫెస్టోకు ఉన్న తేడా ఏమిటో ప్రజలే చెబుతున్నారు.



డాక్టర్ వీ.పద్మనాభరెడ్డి, విశ్రాంత వీసీ, ఎస్వీ వెటర్నరీ వర్సిటీ

ఆచరణ సాధ్యం కాని హామీలతో మోసం

2014లో చంద్రబాబు ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చారు. ప్రజలు నమ్మి ఓట్లు వేసి అధికార పీఠంపై కూర్చోపెట్టారు. అయితే ప్రజల నమ్మకాన్ని ఆయన వమ్ము చేశారు. ఏ ఒక్క హామీనీ నెరవేర్చక తన స్వార్థ ప్రయోజనాలకు పెద్దపీట వేశారు. వెబ్‌సైట్ నుంచి టీడీపీ మేనిఫెస్టోను తొలగించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సీఎంగా ఉన్నప్పుడు ఇలాగే ఆయన తీరు కొనసాగింది. 2019ఎన్నికలలో ప్రజలు ఆయనకు తగిన బుద్ధి చెప్పారు. మరోమారు అధికారానికి దూరమవుతున్నామని స్పష్టంగా ఆయనకు అర్థమైంది. దీంతో ప్రజలు విశ్వసించని పార్టీలతో కూటమిగా ఏర్పడి ప్రజలను మభ్య పెట్టేందుకు కాపీ మేనిఫెస్టోను విడుదల చేశారు.

పశువైద్యానికి పెద్దపీట వేసి రైతులను ఆదుకున్న జగన్

2019లో సీఎంగా బాధ్యతలు స్వీకరించిన జగన్ ప్రధానంగా గ్రామీణ ప్రజల కష్టాలపై దృష్టి సారించారు. పశువైద్యానికి పెద్దపీట వేసి 1962 హెల్ప్ లైన్ నంబర్‌కు రైతు సమాచారం ఇస్తే వెంటనే ఇంటి వద్దకే వెళ్లి పశువులకు వైద్యసేవలు అందించేలా ప్రత్యేకంగా వైఎస్ఆర్ సంచార పశు ఆరోగ్య సేవ పేరుతో అంబులెన్స్ ఏర్పాటు చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలోనే ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి బీజం పడింది. పేదల పక్షపాతిగా గుర్తింపు తెచ్చుకున్న ఆయనను ఇప్పటికీ ప్రజలు పాడి పరిశ్రమ పితామహుడిగా అభివర్ణిస్తున్నారు. వర్సిటీలో దేశంలోనే తొలిసారి కాలిగిట్ట వ్యాధికి వ్యాక్సిన్ అందుబాటులోకి తెచ్చాం. తండ్రి బాటలో సీఎం జగన్ నడుస్తూ పశుసంపదను అభివృద్ధి చేయాలనే కృతనిశ్చయంతో పుంగనూరు బ్రీడ్‌ను, ఒంగోలు ఆవులకు పూర్వ వైభవం తీసుకురావడం కోసం పిండమార్పిడి విధానంతో మేలు జాతి పశువుల అభివృద్ధికి తోడ్పాటునందించారు.

పేద విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో పోటీపడాలనే తపన

విద్యారంగంలో అనతి కాలంలో సమూల మార్పులు చేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన ప్రవేశపెట్టడంతో పాటు నాడు–నేడుతో కార్పొరేట్ స్కూళ్లకంటే మిన్నగా ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మార్చారు. విద్యతోనే ప్రజల జీవితాలు మారుతాయనే బలంగా విశ్వసించిన ఏకైక నాయకుడు సీఎం జగన్, అంతర్జాతీయ స్థాయిలో పేద విద్యార్థులు రాణించాలే ఉద్దేశంతో ఎడెక్స్ సంస్థతో విదేశీ విద్యను ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులకు అందిస్తుండటం ఇందుకు ఉదాహరణ. ఉద్యోగం, ఉపాధే లక్ష్యంగా తమ చదువులకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకేందుకు స్కిల్ వర్సిటీలను ఏర్పాటు చేస్తున్నారు. 'విదేశీ విద్యాదీవెన' కింద ఎంతో మంది విద్యార్థులు పెద్దమొత్తంలో లబ్ధి పొంది విదేశాలలో పేరొందిన వర్సిటీలలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. చంద్రబాబు హయాంలో పశువైద్య విద్యపై చాలా మంది విద్యార్థులు ఆసక్తి చూపలేదు. ఇందుకు ప్రధాన కారణం ఆయన పాడి పరిశ్రమను నిర్వీర్యం చేయడమే. ఇదే జగన్ పాలనలో పాడిరంగం పరుగులు తీస్తోంది.

ప్రచారపర్వం



తనయుడి కోసం తండ్రి తిరుపతి 20వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి భూమన అభినయ్ తరఫున ప్రచారం చేస్తున్న ఆయన తండ్రి భూమన కరుణాకర రెడ్డి



తండ్రి తరఫున తనయ శ్రీకాళహస్తిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బియ్యపు మధుసూదన్ రెడ్డి తరఫున ప్రచారం చేస్తున్న ఆయన కుమార్తె పవిత్రా రెడ్డి



పతి కోసం సతి కుప్పం నియోజకవర్గంలో తన భర్త, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి భరత్‌ను గెలిపించాలని కుప్పం మండలం గరిగచీనేపల్లెలో ప్రచారం చేస్తున్న దుర్గా పద్మిని



పతి కోసం సతి పలమనేరు నియోజకవర్గం వి.కోట మండలంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటే గౌడ తరఫున ప్రచారం చేస్తున్న ఆయన భార్య పావనీగౌడ



ఇలా ఓటెయ్యాలి బంగారుపాళెంలో మండలంలో ప్రచారం చేస్తూ ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ పూతలపట్టు అభ్యర్థి సునీల్‌కుమార్

-సాక్షి, నెట్‌వర్క్

స్మార్ట్‌గా అభివృద్ధి

- మారిన తిరుపతి రూపురేఖలు
- స్మార్ట్‌సిటీ నిధులతో కొత్త పుంతలు
- అత్యాధునిక హంగులతో వసతులు
- తలమానికంగా శ్రీనివాససేతు ఫ్లైఓవర్
- టీటీడీ, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, ఏపీఎస్‌పీడీసీఎల్ భాగస్వామ్యంతో ముందుకు



శ్రీనివాస సేతు ఫ్లై ఓవర్





తిరుపతి తుడా: ఆధ్యాత్మిక తిరుపతి నగరం స్మార్ట్‌గా అభివృద్ధి చెందుతోంది. 2017లో కేంద్ర ప్రభుత్వం స్మార్ట్‌సిటీ ప్రాజెక్టును తీసుకువచ్చింది. తిరుపతి స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌ను మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటుచేసి ఈ ప్రాజెక్ట్ వ్యయం రూ.1,610 కోట్లకు ఆమోదం పొందింది. ఇందులో కేంద్రం రూ.500 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్లు, మిగిలిన రూ.610 కోట్లను ఇతర సంస్థల ద్వారా సేకరించుకునేలా స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ అనుమతులు తీసుకొచ్చింది. ఈ క్రమంలో శ్రీనివాససేతు ఫ్లైఓవర్ నిర్మాణంలో టీటీడీ, అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ వ్యవస్థలో ఏపీఎస్‌పీడీసీఎల్‌ను భాగస్వామ్యం చేసింది. ఇలా ప్రారంభమైన ప్రాజెక్టు 2018లో ఎన్నికల ముందు పట్టాలెక్కింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్‌ను ఛాలెంజ్‌గా తీసుకొని ఐదేళ్లలో సుమారు రూ.1,400 కోట్లకు పైగా వెచ్చించి 78 ప్రాజెక్టులను పూర్తిచేసింది. మరో 19 ప్రాజెక్టులు నిర్మాణదశలో ఉన్నాయి. మరో ఏడాదిలో ఇవి పూర్తిచేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ఆధునిక వసతులు

స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా ప్రజలకు ఆధునికంగా వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ క్రమంలోనే అనేక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను చేపట్టింది. అనేక ప్రాజెక్టులు నిధులను రీజనరేట్ చేసుకునేలా డిజైన్ చేశారు. ఇందులో సోలార్ పవర్‌ప్లాంట్‌లు, శుద్ధినీటి కేంద్రాలు, పార్కుల అభివృద్ధి, నూతన భవనాల నిర్మాణం, టర్ఫ్‌పిచ్ క్రికెట్ స్టేడియం, ఇండోర్ స్టేడియం, డిస్ట్రిక్ ఆర్ట్ స్టూడియో, ఆధునిక ఆడిటోరియం, శ్రీనివాససేతు ఫ్లైఓవర్ వంటి వాటికి పెద్దపీట వేశారు. రూ.1,610 కోట్లలో అత్యధికంగా ఇలాంటివాటికే ఖర్చుచేశారు.

మురుగునీటి శుద్ధి కేంద్రం

తిరుపతి నగరంలో బాత్‌రూమ్స్, టాయ్‌లెట్ల నుంచి రోజుకు 34.5 ఎంఎల్‌డీ వ్యర్థపునీరు (3కోట్ల 45లక్షల లీటర్లు) వెలువడుతోంది. ఈ నీటిని పునర్వినియోగంలోకి తీసుకొచ్చేందుకు తూకివాకం గ్రీన్ సిటీలో 60 ఎకరాల విస్తీర్ణంలో నీటిశుద్ధి ప్లాంట్‌ను నిర్వహిస్తోంది.సీవరేజ్ ప్లాంట్ నిర్మాణానికి రూ.48.8 కోట్లను ఖర్చుచేసి అభివృద్ధి చేశారు. ఇలా శుద్ధిచేసిన నీటిని వివిధ ప్రైవేటు కంపెనీలకు సరఫరా చేస్తూ ఆదాయం పొందుతున్నారు. పరిసరప్రాంత రైతులకు ఉచితంగా నీటిని అందిస్తున్నారు.

ఐకాన్‌గా కార్పొరేషన్ భవనం

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ నూతన భవనం (సిటీ ఆపరేషన్ సెంటర్)ను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం రెండో అంతస్తు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నగరంలో భద్రత, శానిటేషన్ పర్యవేక్షణే లక్ష్యంగా సిటీ ఆపరేషన్ సెంటర్‌ను తీర్చిదిద్దుతున్నారు. నగరంలో అత్యాధునిక సీసీ కెమెరాలను అమర్చడానికి రూ.90 కోట్ల మేర ఖర్చుచేస్తున్నా రూ.1.5 ఎకరాల విస్తీర్ణంలో 5 అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో 6 లిఫ్టులు ఉండనున్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌ను పూర్తిగా పార్కింగ్, రెండో అంతస్తులో కార్పొరేషన్ కార్యాలయం, ఒకటో అంతస్తులో కమాండ్ కంట్రోల్ సెంటర్, మరొక అంతస్తులో పాలకవర్గం చాంబర్, కన్వెన్షన్ హాల్ ఉండేలా చర్యలు తీసుకున్నారు.

ముఖ్యమైన ప్రాజెక్టులు	వెచ్చించిన మొత్తం
శ్రీనివాస సేతు ఫ్లైఓవర్	రూ.650.50 కోట్లు
అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్	రూ.113 కోట్లు
సీసీసీ	రూ.180 కోట్లు
సిటీ ఆపరేషన్ సెంటర్ బిల్డింగ్	రూ.90 కోట్లు
మోడరన్ స్మార్ట్‌సిటీ పవర్‌కేబుల్ నెట్‌వర్క్	రూ.62.10 కోట్లు
సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్	రూ.48.80 కోట్లు
మల్టీలెవెల్ కార్ పార్కింగ్, మల్టీ ప్లెక్స్	రూ.50 కోట్లు
గ్లోబింగ్ సోలార్	రూ.21.97 కోట్లు
బయోమైనింగ్ ప్రాసెస్	రూ.20 కోట్లు
65 కేఎం, 33 కేవీఏ అండర్ గ్రౌండ్ ఎలక్ట్రిఫికేషన్	రూ.31.19 కోట్లు
వాటర్ సప్లై ఇంప్రూమెంట్స్	రూ.28.17 కోట్లు
ట్రాన్స్‌ఫర్ స్టేషన్స్ (చెత్త నిర్వహణ కోసం)	రూ.17.50 కోట్లు
వినాయక సాగర్ లేక్	రూ. 15 కోట్లు

సాగర్ ..సొగసు చూడతరమా



తిరుపతిలో సరైన విహార స్థలం లేకపోవడం నగరవాసుల్ని దశాబ్దాలుగా వేధిస్తోంది. ఈ లోపాన్ని అధిగమించి కుటుంబ సమేతంగా, యాత్రికులు సైతం రోజంతా గడిపేలా వినాయక సాగర్‌ను ఆధునికంగా అభివృద్ధి చేశారు. గ్రీనరీ, నీటిశుద్ధి కేంద్రం, వాకింగ్ ట్రాక్ వంటి పనులు పూర్తిచేసుకోగా ఐస్‌ల్యాండ్, స్విమ్మింగ్ పూల్, మ్యూజిక్ ఫౌంటేన్, చిల్డ్రన్ పార్క్, ఓపెన్ గ్యాలరీ, ఓపెన్‌జిమ్, స్విమ్మింగ్‌పూల్, రెస్టారెంట్ల నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి చేశారు. సాగర్ అభివృద్ధి కోసం ఇప్పటివరకు రూ.15 కోట్లకు పైగా ఖర్చు చేశారు. ప్రస్తుతం వినాయకసాగర్ సందర్శకులతో కళకళలాడుతోంది.

అత్యాధునిక ఆడిటోరియం



తిరుపతి నగరంలో ప్రస్తుతం మహతి, శ్రీనివాస ఆడిటోరియాలు అందుబాటులో ఉన్నాయి. నగర నడిబొడ్డున తుడా ప్రాంగణంలో కచ్చపి ఆడిటోరియాన్ని ఇటీవల పూర్తిచేసి నగర ప్రజలకు అంకితం చేశారు. సెంట్రల్ ఏసీ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆడిటోరియాన్ని నిర్మించారు. సాధారణ అద్దెతో ఆడిటోరియాన్ని పొందవచ్చు. దీని అభివృద్ధి కోసం రూ.18 కోట్లమేర ఖర్చుచేశారు. ఇదే ప్రాంతంలో డిస్ట్రిక్ ఆర్ట్ స్టూడియోను నిర్మిస్తున్నారు.

తొలి టర్ఫ్ పిచ్

తిరుపతి నగరంలో 7 విశ్వవిద్యాలయాలు, ఇతర విద్యాసంస్థలు ఉన్నా ఇప్పటివరకు సరైన క్రీడామైదానం లేదు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా టర్ఫ్‌పిచ్ క్రికెట్ గ్రౌండ్‌ను గొల్లవానిగుంటలో నిర్మిస్తున్నారు. దాదాపుగా నిర్మాణపనులు పూర్తి చేసుకున్నాయి. ఇందుకోసం రూ.3కోట్ల మేర ఖర్చుచేస్తున్నారు.



సోలార్ విద్యుత్



తిరుపతి స్మార్ట్‌సిటీ సౌర విద్యుత్ ఉత్పత్తిలోనూ మేటిగా నిలిచింది. తిరుపతి నగరానికి అవసరమయ్యే విద్యుత్‌ను సొంతంగా అభివృద్ధి చేసుకునే విధానంపై ప్రధానంగా దృష్టి సారించింది. కైలాసగిరి రిజర్వాయర్‌లో4 మెగావాట్ల సామర్థ్యంతో ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్‌ను అభివృద్ధి చేశారు. అలాగే తూకివాకం గ్రీన్‌సిటీలో సౌరవిద్యుత్ 6 మెగావాట్లు, కార్పొరేషన్ భవనాలపై 0.746 మెగా వాట్లు ఉత్పత్తి చేస్తున్నారు. కార్పొరేషన్ విద్యుత్ వినియోగానికి ఏటా కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుండగా.. సోలార్ పవర్ ప్లాంట్ ఉత్పత్తి వల్ల సగానికి పైగా ఖర్చు తగ్గింది.

తిరుపతిలో అభివృద్ధి వివరాలు

స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్
తిరుపతి స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్

ప్రాజెక్ట్ మొత్తం
రూ.1,610 కోట్లు

మొత్తం అభివృద్ధి ప్రాజెక్టులు	97
పూర్తి చేసుకున్న ప్రాజెక్టులు	78
ఇంకా నిర్మాణదశలో ఉన్నవి	19

శ్రీనివాస సేతు

తిరుపతి నగరంలో రోజూ లక్షకుపైగా యాత్రికులు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో నగర రహదారులు నిత్యం ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుంటున్నాయి. బయట ప్రాంతాల నుంచి యాత్రికులు నేరుగా నంది సర్కిల్‌కు చేరుకునేలా శ్రీనివాసేతు ఫ్లైఓవర్ నిర్మించాలని సంకల్పించారు. 6.4 కి.మీ పొడవు రూ.650.50 కోట్ల వ్యయంతో ఈ ఫ్లైఓవర్‌ను నిర్మించారు. తిరుపతి నగరానికే ఇది మణిహారంగా మారింది.

తిరుపతి మారుతోంది



తిరుపతిలో పుట్టి పెరిగాను. గడిచిన ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి సాధించింది. అనతి కాలంలోనే తిరు పతి రూపురేఖలు మారిపోయాయి. నగర ప్రజలు అభివృద్ధి చెందుతున్న తిరుపతి పరిస్థితులను గమనిస్తున్నారు. ఫ్లైఓవర్ తిరుపతికి ఐకాన్‌గా నిలిచింది. వినాయక సాగర్‌ను ఆధునికంగా అభివృద్ధి చేశారు. కుటుంబ సమేతంగా రోజంతా సాగర్‌లో గడపవచ్చు. నగరంలోని రోడ్ల రూపురేఖలు మారిపోయాయి.

– ఎస్. కుమారి, తిరుపతి

అభివృద్ధి కంటికి కనిపిస్తోంది



తిరుపతిలో చేపట్టిన అభివృద్ధి కంటికి కనిపిస్తోంది. నేటి పాలకులు మాటల్లో కాకుండా చేతల్లో అభివృద్ధి చేసి చూపించారు. ఏడు యూనివర్సిటీలు ఉన్నా ఇప్పటి వరకు టర్ఫ్ పిచ్‌తో క్రికెట్ స్టేడియం లేకపోయింది. నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన క్రికెట్ స్టేడియం పనులు పూర్తి చేసుకున్నాయి. స్మార్ట్ సిటీలో భాగంగా నిర్మించిన కచ్చపి ఆడిటోరియం అత్యద్భుతంగా ఉంది. పార్కులు, ఓపెన్ ఆడిటోరియం, జిమ్‌లను ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేశారు. ఎప్పుడూ లేని అభివృద్ధి గడిచిన నాలుగేళ్లలో చేసి చూపించారు. ఈ ప్రభుత్వానికి అభినందనలు.

–డి. లక్ష్మయ్య, శివజ్యోతినగర్, తిరుపతి